

# మ్యూజికల్ మ్యూజింగ్స్



## - కస్తూరి మురళీకృష్ణ

ఛాప్ తిలక్ సబ్ ఛీనీ రే  మోసె నైనా మిలాయ్‌కే

బాత్ ఆగమ్  కహ దీనీ రే మోసే  నైనా మిలయ్‌కే

13వ శతాబ్దికి చెందిన అమీర్ ఖుస్రో రాసిన ఈ గీతాన్ని ఆ 'మై తులసీ తెరే ఆంగన్‌కీ' సినిమాలో వాడుకున్నారు కానీ, పలురకాలుగా, విభిన్నమైన పల్లవులు చరణాలతో ఈ గీతం  ప్రచారంలో ఉంది .ఏది అమీర్ ఖుస్రో రాసినదో,  ఏది ఇతరులు అమీర్‌ఖుస్రో పంథాలో రచించి పాటలో భాగం చేశారో ఎవరికీ తెలియదు. అమీర్‌ఖుస్రో రాసినప్పటి నుంచీ ఎంతోమంది ఈ పాటను పాడారు. పాటలో తమదైన ప్రత్యేక అంశాలను చేర్చారు. అవి ప్రజాదరణ పొంది ప్రచారంలోకి రావటంతో ఏది అసలో, ఏది జోడింపో తెలియని పరిస్థితి వచ్చింది. అన్నీ అమీర్ ఖుస్రో పేరుతోనే చలామణీ అవుతున్నాయి. అమీర్ ఖుస్రో తాను రచించిన పర్షియన్ రచనలకిచ్చిన ప్రాధాన్యాన్ని హైందవి భాషలో రాసిన రచనలకు ఇవ్వలేదు.  హైందవీ భాషలో పాటలు రాసి వాటిని పక్కన వున్న వారికి ఇచ్చేసేవాడు. వాళ్ళు పాడుతూ ప్రచారం చేసేవారు. కానీ, కొంతకాలం తరువాత ఎవరుపడితే వారు ఇది అమీర్ ఖుస్రో గీతం అని తాము రాసిన గీతాలకూ ప్రచారం ఇచ్చుకోవటం మొదలయింది. దాంతో ఏది అసలయిన అమీర్ ఖుస్రో గీతమో, ఏది ఇతరులు ఖుస్రో పంథాలో రాసినదో తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ వివాదం ఇప్పటికీ సాగుతోంది.

సినిమాలో 'ఛాప్ తిలక్ సబ్ ఛీ నీరే మోసెనైనా మిలాయ్‌కే' అన్న పాదంతో పల్లవి పూర్తవుతుంది. కానీ ప్రచారంలో 'బాత్ అగమ్ కహదీనీరే మోసె నైనా మిలాయ్‌కే ' అన్నది కూడా పల్లవిగా ప్రచారంలో ఉంది. ఎద్దైతే పైకి అనకూడనిది ఉంటుందో, రహస్యమో, చెప్పకూడనిదో, అది కూడా నా కళ్లతో కళ్లు కలిపి వ్యక్తం చేసేశాడు అన్నది ఈ పాదం అర్థం.

పైకి చూసే ఓ యువతి ప్రియుడి కళ్లు తన కళ్లతో కలవగానే సర్వం మరచి తన అస్తిత్వాన్ని విస్మరించి అతని అస్తిత్వాన్ని స్వీకరించిన భావన కలిగిస్తుంది. కానీ తరచి చూస్తే కానీ  దైవ భావన అందరికీ అర్థంకాదు. తపస్సు చేసినవారికీ, దైవారాధనలో తన్మయమై తనను తాను మరచిన వారికి మాత్రమే దైవభావనను కళ్లు కలిపి వ్యక్తపరిచాడన్న

భావన వస్తుంది. దైవారాధనలో వ్యక్తిగత అనుభవాలు కొన్ని వుంటాయి. ఇతర అనేక అంశాలు చెప్పేవారుకూడా ఈ వ్యక్తిగత అనుభవాలను గోప్యంగా వుంచుతారు. వాటిని బహిరంగపరచరు. అలాంటి రహస్యాన్ని కూడా కళ్ళతో కళ్ళుకలిపి వ్యక్తపరచాడన్నమాట.

యువతీ యువకుల ప్రేమ పైపై తొడుగు మాత్రమే. నిజామ్ – ఉద్ – దీన్ ఎలా తన సర్వస్వాన్ని తననుంచి దోచుకుని, తనకంటూ ప్రత్యేక అస్తిత్వం అన్నది లేకుండా చేసి, తమదైన భావనను బోధించాడో ఆ భావనను ఈ పాట ద్వారా ప్రదర్శిస్తున్నాడు అమీర్ ఖుస్రో . అమీర్ ఖుస్రో కళ్లతో కళ్లు కలిపి నిజామ్–ఉద్ – దీన్ ఔలియా అతనికి అతి గహ్యమయిన, గుహ్యమయిన దైవ భావనను స్పష్టం చేశాడన్నది అసలు అర్థం. దీనికి మరో పాఠ్యాంతరం ఉంది.

ఛాప్ తిలక్ సబ్ ఛీనీ రే మోసె నైనా మిలాయ్‌కే

ప్రేమ్ భాతీ కే మధ్య పిలాయ్‌కె

మత్వాలీ కర్ లీనీరే మోసె నైనా మిలాయ్‌కే.

దివ్యత్వ మత్తు కలిగించే ప్రేమ అనే మద్యం తాగించాడు నాతో కళ్లు కలిపి అంటుందీ పల్లవి. రెంటింటి అర్థం ఒకటే. వ్యక్తపరచిన పదాలు వేరు.

సినిమాలో చరణాలు రెండు అమీర్ ఖుస్రో రాసినవిగా ప్రచారంలో ఉన్నాయి. కానీ మొదటి చరణం కొందరు అమీర్ ఖుస్రో చరణంగా అంగీకరించరు.

ఏరీ సఖీ

మై తోసే కహూ

హాయ్ తోసే కహూ

మైజో గయా థీ

పనియా భరన్‌కో

చాప్ ఝూపట్ మోరీ మట్‌కీ పట్‌కీ

నైనా మిలాయకే.

ఓ సఖీ, నేను నీళ్లు నింపుకునేందుకు వెళ్తున్న సమయంలో, హఠాత్తుగా నా నీటి పాత్రను నాతో కళ్లు కలిపి లాక్కున్నాడు.

అమీర్ ఖుస్రో గేయాల్లో ఈ భావన పలు సందర్భాలలో కనిపిస్తుంది. తరువాతి కాలంలో గోపికలు నీళ్లు నింపుకునేందుకు వెళ్తూంటే చిలిపి కృష్ణుడు రాళ్లు విసిరి వాళ్లు నీటి కడవలను విరగగొట్టినట్టు రచన అనేకానేక గీతాలకు ప్రేరణ  అమీర్‌ఖుస్రోనే.

బల్ బల్ జూవూమై

తోరే రంగ్ రజేవా

ఆప్ నీ సీ రంగ్, రంగ్ లీనీ రే

మోసెనైనా మిలాయ్‌కే...

నీకోసం నా ప్రాణాలర్పిస్తాను. నా జీవితం నీదే. ఒక్క చూపులో నన్ను నీ రంగులో ముంచెత్తావు.

సాధారణంగా 'రంగ్ లీ ' అంటే ఎదుటి వ్యక్తిని స్వీకరించటం, అతనిలో లీనమైపోవటం.

'మైన్ రంగ్ లీ ఆజ్ చునరియా, సజ్‌నా తోరే రంగ్‌మే '

'దుల్హన్ ఎక్ రాత్ కీ' సినిమాలో రాజా మెహదీ అలీఖాన్ రచన ఇది. తన చెంగుకు  ప్రియుడు రంగు వేసుకున్నాను అంటోంది. నాయిక ఇలాంటి భావన  'రంగ్‌దే 'ను ప్రియుడిలో లీనమై అస్తిత్వాన్ని కోల్పోవటాన్ని సూచిస్తూ అనేక సినీపాటలున్నాయి.

'ముఝె రంగ్‌దె, రంగ్‌దే, రంగ్‌దే' అంటూ టబూ నృత్యం చేస్తుంది 'తక్షక్' సినిమాలో. పాట నడుమ తెరె నైనా, మెరెనైనోంమే రంగ్‌దే, హై అప్న ప్రీత్ విచ్ రంగ్‌దే' అంటుంది. దాచాలన్నా దాగని అమీర్ ఖుస్రో భావనలు స్పష్టమౌతాయి.

గోరీ గోరీ బయ్యాన్

హరి హరి చూడియాన్

బయ్యా పకర్ హర్ లీనే రే

మోసెనైనా మిలాయ్‌కే...

నా తెల్లటి మృదువైన హస్తాలకు ఉన్న పచ్చటి గాజులకు కళ్లు కలిపి దొంగిలించాడు. ఇక్కడ పలువురు తెల్లటి హస్తాలకు పచ్చటి గాజులు తొడిగాడు. పచ్చరంగు ఇస్లాం చిహ్నం కాబట్టి చేతులకు పచ్చటి గాజులు తొడగటం మతమార్పిడికి చిహ్నం అంటూ అర్థం చేసుకుని అలా వ్యాఖ్యానించారు. కానీ ఇక్కడ అమీర్‌ఖుస్రో అంటున్నది వేరు. తెల్లటి చేతులకున్న పచ్చటి గాజులను కూడా 'హర్ లీనరే' హరించాడు అంటున్నాడు. అంటే ఎలాంటి అస్తిత్వం, గుర్తింపు లేకుండా చేశాడన్నమాట.

ఖుస్రో నిజామ్ కే బల్ బల్ జైయ్యే

మోహె సుహాగన్ కీనీరే

మోసె నైనా మిలాయ్‌కే

అసలు అమీర్ ఖుస్రో పాటను రాసిందే చివరి చరణం కోసం నా జీవితం సర్వం నీకే అంకితం నిజాం ( నిజం – ఉద్ – దీన్ ఔలియా). ఒక్క చూపుతో నన్ను నీ వధువుగా చేసుకున్నావు అంటున్నాడీ చరణంలో. ఎలాగయితే, వివాహం తరువాత భార్య భర్తనే తన సర్వస్వం అనుకుని తన అస్తిత్వాన్ని కోల్పోతుందో, అలాగే నిజాం – ఉద్ – దీన్ ఔలియా వధువుగా తన సర్వం మరచిపోయి అతడినే దైవంగా స్వీకరించాడన్నమాట అమీర్ ఖుస్రో. ఈ భావనను తాను ప్రేయసిగా, నిజాం – ఉద్ – దీన్ ప్రియుడిగా భావించి ఈ గీతంలో ప్రకటించాడు అమీర్ ఖుస్రో.

అమీర్ ఖుస్రో ఈ గీతానికి మరో పాఠ్యాంతరం ఉంది. పాకిస్తానీ గాయనీగాయకులు అధికంగా ఈ గీతాన్ని ఇలానే పాడతారు. ఇందులో 'సాకీ' కూడా వేరుగా ఉంటుంది.

తన మన్ ధన్ బాడీలాగిరే

ధన్ ధన్ మోరె భాగ్ బాబీలాగిరే

లాగిలాగి సబ్ కహే

లాగి లగీ న అంగ్

లాగితో జబ్ జానియే

జబ్ రహీ గురూ కె సంగ్

మౌలా ఓ జీ మౌలా

ఖుస్రూ బాజీ ప్రేమంకీ

జీ మై ఖేలీ పీకే సంగ్

జీత్ గయతో పియా మోరే

జో మై హారీ పీకే సంగ్

ఛాప్ తిలక్ సబ్ ఛీనీరే

మోసెనైనా మిలాయ్‌కే

మోసే బోల్ న బోల్

మేరి సున్ యా నా సున్

మై తో న ఛోడూంగీ ఏయ్  సావరే

మత్వారీ కర్ దేనీరే మోసెనైనా మిలాయ్‌నే...

తనువు, మనస్సు, ధనం సర్వం పణం పెట్టింది. అదృష్టం ఆశీర్వదించింది. భక్తి ఉందని అందరూ అంటారు. కానీ సత్యమైన భక్తి అందరికీ సాధ్యంకాదు. అసలైన భక్తి గురువుకు  సర్వం అర్పించటంలోనే ఉంది. అప్పుడే అసలు భక్తి అనుభవానికి వస్తుంది. నా గురువుతో నేను ప్రేమ ఆటను ఆడతాను. నేను గెలిస్తే గురువు నావాడవుతాడు. నేను ఓడితే గురువు దగ్గర బానిసనై సేవ చేస్తాను. నా కళ్లతో కళ్లు కలిపినా అస్తిత్వం దోచుకున్నావు. నాతో మాట్లాడినా మాట్లాడకున్నా, నా మాట విన్నా, వినకున్నా నేను నీ సాంగత్యం వీడను. కళ్లతో కళ్లు కలిపి నాకు భక్తి మత్తునిచ్చి తన్మయుడిని చేశావు. మా గురువు నిజామ్ – ఉద్దీన్ ఔలియా!

ఇపుడు పాటలో ఎక్కడా 'లవ్‌జిహాద్' అన్న ఆలోచన కనబడదు .పూర్తిగా గురుభక్తిలో సర్వం మరచిపోయి అస్తిత్వాన్ని కోల్పోయి భక్తి  మత్త చిత్తుడైన కవిగానం కనిపిస్తుంది.

రైనీ బరీ రసూల్‌కీ

రంగ్ మౌలా కె హాథ్

జిస్కీ చున్రీ రంగ్‌దీ

ధన్‌ధన్ ఉస్కే భాగ్

ఖుస్రూ నిజామ్  కి బల్ అల్ జైయే

మోహె సుహాగన్ కీనీరే మోసెనైనా మిలాయ్‌కే

ప్రవక్త గురించి సంబరాలు చేసుకునే రాత్రి వచ్చింది. రా, అతనిలో లీనమౌదాము. ఆయన ఎవరిని ఎన్నుకుంటే వారు ధన్యులు. నిజామ్ – ఉద్ – దీన్ ప్రేమలో ఖుస్రూ తన ప్రాణాలను వదులుకుంటాడు. ఒక్కసారి కళ్లు కలిపి నన్ను నీ వధువును చేసుకున్నావు. నా సర్వస్వాన్ని దోచి నా అస్తిత్వాన్ని అదృశ్యం చేశావు, నాతో కళ్లు కలిపి.

ఈ ఖవ్వాలీ, \గజల్ \ భక్తి గీతాన్ని తన్మయత్వంతో పాడతారు. ఒకో పదాన్ని లాగదీసి, సాగదీసి, అనుభవిస్తూ, భిన్నమైన రీతుల్లో ఉచ్చరిస్తూ, ఆ పదంలో లోపల దాగున్న అనంతమైన భక్తి భావనలను, పవిత్రమైన ఆలోచనలను వెలికి తీసి విశ్వమంతా వెదజల్లుతున్నట్టు ఒళ్లు మరచి, భక్తి మత్త చిత్తులై హృదయంతో పాడతారు ఈ పాటను. వింటూంటే భక్తి భావనల సముద్రపు లోతులను చవి చూస్తూ భక్తి సంద్రటలలపై తేలియాడుతూ ఉక్కిరిబిక్కిరి అవుతాము. గమనించాల్సిందేమిటంటే, దైవం ఎవరయినా భక్తి భావన, తన్మయత్వం, సర్వస్వాన్ని అర్పించటం, అస్తిత్వాన్ని కోల్పోవటం వంటి భావనల్లో సార్వజనీనత్వం వుంది.

అమీర్ ఖుస్రో రచనల్లో ఒక పద్ధతి కనిపిస్తుంది. ఆయన సుల్తానుల గురించి రాసినవన్నీ పర్షియన్ భాషలో రాశాడు. భక్తి గీతాలన్నీ అందరికీ సులువుగా అర్ధమయ్యే హైందవి భాషలో రాశాడు. బ్రజ భాష, హిందీ, ఉర్దూ, అక్కడక్కడా పర్షియన్ పదాలతో కూడిన భాషను వాడాడు. దాంతో, ఆయన సుల్తానుల గురించి చేసిన రచనలు పండితులకు పరిశోధనలకు ప్రీతిపాత్రమయ్యాయి. ప్రేయసీ, ప్రియల ప్రేమపై ఆరోపించి ప్రదర్శించిన భక్తిగీతాలు సమాజం నలుమూలలా విస్తరించి ,తరువాత వచ్చిన భారతీయ కవులను ప్రభావితం చేశాయి. ఆ ప్రభావం సినీ ప్రేమగీతాలపై తిరుగులేని రీతిలో పడింది .తనను ప్రేయసిగా, భగవంతుడిని ప్రియుడిగా భావించి, భగవంతుడి ప్రేమలో సర్వం మరచి లీనమయ్యే భావనలతో అనేక సినీ భక్తిగీతాలు వెలిశాయి. రాధాకృష్ణుల ప్రసక్తి తొలిసారిగా హాలుడి గాథ సప్తశతిలో కనిపిస్తుంది. గీతగోవిందం వారి రాసలీలలకు శృంగార భావనలకు ఆధ్యాత్మకపు రంగులద్దింది. నింబార్కా చార్యులు రాధకు దైవత్వం ఆపాదించారు. చైతన్య మహాప్రభు రాధా మాధవ రమణీయ ప్రేమగాధలను ఆధ్యాత్మిక సాధన దిశవైపు మళ్లించాడు. దైవాన్ని వ్యక్తిగతం చేస్తూ, సాధన ద్వారా సంపూర్ణ సత్యాన్ని గ్రహించే మార్గం సూచించాడు.

అమీర్ ఖుస్రో తరువాత మధ్యయుగంలోని కవులు, భక్తులు అందరి భావనల పై అతని గీతాల ప్రభావం కనిపిస్తుంది.

'ఆండాళ్' తనను తాను విష్ణువు వధువుగా భావించుకుని అతనిలో లీనమైన గాథ ప్రభావం అమీర్‌ఖుస్రో భక్తి భావనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆ భావనను ఇస్లాంలోని పూర్తిగా లొంగిపోయే సర్వం విస్మరించే భక్తి భావనను జోడించి అత్యద్భుతమైన గీతాలను రచించాడు అమీర్ ఖుస్రో. వీటి ప్రభావంతో అత్యద్భుతమైన సినీగీతాలను సృజించారు హిందీ సినీ గేయ రచయితలు.

'అమీర్‌ఖుస్రో'కు భారతీయ భక్తి భావనతో పరిచయం అతని తల్లివల్ల, తాతయ్యవల్ల కలిగింది. సుల్తాన్‌లతో యుద్ధానికి వెళ్లినపుడు యుద్ధ వర్ణనతోపాటు అమీర్‌ఖుస్రో స్థానిక సాహిత్యం గురించీ తెలుసుకున్నాడు. ఇదంతా అతని గేయ రచనపై ప్రభావం చూపించింది. భక్తి గీతాలు అందరికీ అందుబాటులో ఉండి బ్రజ భాషలో రాయటంతో విపరీతమైన ప్రజాదరణ పొందాయి. భారతీయ సమాజంపై ఈనాటికీ ప్రభావం చూపిస్తున్నాయి. దాదాపుగా 30 వరకూ అమీర్‌ఖుస్రో గేయాలను సినిమాల్లో పలు సందర్భాలలో వాడుకున్నారు.

కాహేకో బ్యాహీ విదేశ్ (నాదిర్ షాహ), సయ్యా రూఠ్ గయే, (మై తులసీ) ఖుస్రో రై సుహాగ్‌కీ జాగీ పీకె సంగ్ (జునూన్) వంటి అనేకమైన పాటలు సినిమాల్లో వాడేరు. ముఖ్యంగా కూతురిని అత్తారింటికి పంపే పాట 'కాహేకో బ్యాహీ విదేశ్' పాటను పలువురు సినిమాల్లో వాడుతున్నారు. అందుకే సినీగీతాలకు 'పితామహుడు' అమీర్ ఖుస్రో అనవచ్చు.

(వచ్చేనెల మరిన్ని పాటలతో కలుద్దాం..)

Click here to share your comments